# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బిడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహాకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కధా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పోరాటం

"రేపు కొత్త కస్టమర్ కేర్ సూపర్ వైజర్ వస్తారుట." చెప్పాడు సత్య కొలీగ్ శివతో..

" అలాగా?" అన్నట్టు చూశాడు శివ అతని వైపు..

" అలాగా అనకు! మనకి పని ఎక్కువతుందిలే" అన్నాడు సత్య..

" పని చేస్తూనే ఉన్నాము కదా! " అన్నాడు శివ కాస్త నిర్లక్ష్యంగా..

" నీకర్థం కావటం లేదులే నేనన్నది" అన్నాడు సత్య..

అప్పటికి రమ, వాణి కూడా వచ్చారు..

" ఏమిటి విషయం" అంది వాణి, తను వేసుకున్న స్వెటర్ తీసి కుర్చీ మీద వేస్తూ.. ఐదడుగుల ఏడంగుళాలుంటుంది వాణి. ఎత్తుకు తగ్గ లావు..

" కొత్త బాస్ గురించేనా?" అంది రమ.

" అవును!" అన్నాడు సత్య..

మనం చేసేది మనం చేస్తున్నాం, దీంట్లో భయపడేది ఏముంది?" అంది రమ కూడా..

"సరేలెండి ! భయపడడం అని కాదు కానీ మన పని రికార్డులు సరిగా లేవని మనకు తెలుసుకదా! దానిగురించే నేననేది" అన్నాడు సత్య..

ఎవరూ మాట్లాడలేదు..

మర్నాడు వాళ్ళు వచ్చేసరికి పక్కన ఉన్న క్యూబికిల్ లో ఒకమ్మాయి కూర్చుని ఉంది.

ఎప్పుడూ అందరికంటే ముందు వచ్చే సత్య ఆమెని చూశాడు..

ఎవరో తెలీలేదు. అయితే మాట్లాడే ప్రయత్నం చెయ్యలేదు, కారణం ఆమె చాలా శ్రద్ధగా తన కంప్యూటర్ వైపు చూస్తూ, స్క్రీన్ మీద ఏదో చదువుకుంటూ, తన పక్కనున్న పుస్తకంలో రాసుకుంటూ ఉండడమే..

టైము పదయ్యేలోపు మిగతా నలుగురూ వచ్చారు..

గంట పది కొట్టగానే ఆమె ఫోన్ చేతిలోకి తీసుకుని, " ఓకే, యెస్" అంటూ కొన్ని క్షణాలసేపు మాట్లాడింది.

మరో రెండునిమిషాలకి హెచ్. ఆర్ హెడ్ అందరినీ మీటింగ్ రూములోకి పిలిచి ఆమెని కొత్త కస్టమర్ కేర్ సూపర్ వైజర్ గా పరిచయం చేశాడు.

" ఈవిడ పేరు శీతల్. మన కస్టమర్ కేర్ సూపర్ వైజర్ " అన్నాడతను..

టీములోని ఆరుగురూ ఆమె వైపు ఆశ్చర్యంగా చూశారు. నాలుగడుగుల పదంగుళాలుంటుందామె ఎత్తు. సన్నగా, తెల్లగా బొమ్మలా ఉంది. నడుముదాటిన ఒత్తైన తలకట్టు, మెరుస్తున్న నల్లటి కళ్ళు.. ఇవీ ఆమెని చూడగానే ఆకట్టుకునేవి.

" హాయ్!" అందామె నెమ్మదిగా. చిలకపలికినట్టుంది ఆమె గొంతు..

" సూపర్ వైజర్ అంటే ఎవరో పెద్దావిడ అనుకున్నాం, ఈవిడేనా?" అన్నట్టున్నాయి ఆ గదిలోని వారి చూపులు.. అవామెకు కొత్త కాదు.

" హలో" అన్నారు ప్రతిగా.

ఆమె నల్లటి పాంట్ వేసుకుని పైన లేత గులాబీరంగు టాప్ వేసుకుంది. కళ్ళకి కాటుక పెట్టుకుని,పెదవులకి లేత రంగు లిప్ స్టిక్ వేసుకుంది.

అదొక పెద్ద బయోటెక్నాలజీ కంపెనీ వారి ఇండియా కార్యాలయం. వివిధ లాబొరేటరీలకి కావలసిన పరికరాలు, ఇతర ఉత్పత్తులు తయారుచేసి సరఫరా చేస్తారు. అప్పటివరకూ ఆసియా ఖండానికంతా కావలసినవి పంపించడానికి సింగపూర్ లో పెద్ద ఆఫీసు, వేర్ హౌస్

ఉండేది. ఈ మధ్య భారతదేశం, దాని పొరుగుదేశాలైన శ్రీలంకలాంటివాటి సౌకర్యం కోసం ఇండియా ఆఫీస్ లో కూడా ఒక వేర్ హౌస్ ఏర్పాటు చేశారు. అలాగే ఆరుగురున్న ఒక టీమును కూడా ఏర్పాటు చేశారు.

కష్టమర్లందరికీ కావలసినవి సకాలంలో అందుతున్నాయా? వాటిగురించి ఏమైనా ఫిర్యాదులున్నాయా? ఆర్డర్లు ఎలా అందిస్తున్నారు? పాతవి ఉంటే ఎలా చూసుకోవాలి? లాంటి విషయాలన్నీ చూసుకుంటారు వీళ్ళు. కష్టమర్లనించి వచ్చే ఈ మెయిల్స్, మాములు ఉత్తరాలు చూసుకోవాలి. ఫోన్లలో జవాబు చెప్పడానికి వేరే టీముంది..

పేరు పేరునా అందరినీ పరిచయం చేసుకుంది శీతల్. ఆ తర్వాత వారు చేసే పనులనీ, ఎదుర్కొంటున్న సవాళ్ళనీ అడిగి తెలుసుకుంది. కనీ కనబడకుండానే వారు కనబర్చుతున్న నిర్లక్ష్యాన్ని గమనించినా గమనించనట్టే ఊరుకుంది..

ఆమెకిది కొత్త కాదు. మన ఎత్తు, రంగు, రూపు లని బట్టి మనల్ని అంచనా వేసేసి, మనగురించి అభిప్రాయాలనేర్పరుచుకోవడం మనుషులకి కొత్తకాదు. ఆ విషయం ఆమెకి బాగా తెలుసు.

చూస్తే చిన్న పిల్లలా ఉన్నావ్? ఇలాంటి ఉద్యోగం ఎలా చేస్తావ్? లాంటి ప్రశ్నలామెకేమీ కొత్త కాదు. అదే అభిప్రాయాన్ని హెచ్. ఆర్ హెడ్ రాఘవ్ కళ్ళల్లోనూ చూసింది అప్పటికే.

వాళ్ళందరితో మాట్లాడి తన డెస్క్ దగ్గరకొచ్చిన పదిహేను నిమిషాల్లో వారందరి పని వివరాలన్నీ వేసి ఒక చార్ట్ తయారుచేసి అందరికీ ఈ మెయిల్ పంపించింది.

వాటిల్లో వివిధ రకాలైన సమస్యలకి ఎలాంటి సమాధానాలు పంపాలి, తమవల్ల కాకపోతే ఎలా పైవారికి తెలియచెయ్యాలి ? ఏ విషయాల మీద వారి పనిని గ్రేడ్ చేస్తారు? లాంటి వివరాలన్నీ ఉన్నాయి..

అది చూశాకా సత్య, శివ లాంటి వారికి అర్ధం అయింది ఆమెని మొదటిసారి చూసినప్పుడు ఆమె రాసుకుంటున్న వివరాలేమిటో..

ఆ మెయిల్ పంపించి కుర్చీలో వెనక్కి జారబడి తన టీములో ఉన్నవారి వివరాలని పరిశీలించసాగింది శీతల్.

వాణి, రమ ఇద్దరాడపిల్లలు. శివ, సత్య, అమర్, రతన్..

ఏ టీములోనైనా ఆడా మగా నిష్పత్తి సమానంగా ఉంటుందా? ఎప్పటికైనా? అనుకుంది..

తన ఆలోచనలకి తనకే నవ్వొచ్చింది.

అయినా ఆలోచన గతంలోకే మళ్ళింది..

"శీతల్ బేటా.. మీ పాపా కి చాయ్ ఇవ్వు" వంటింట్లోంచి తల్లి కేకకి..

" బబ్లూ అక్కడే ఉన్నాడు, వాడిని ఇవ్వమనమ్మా" అని సమాధానం కూర్చున్న చోటినించే చెప్పింది శీతల్..

" బబ్లూనా? వాడు నీకన్నా పెద్దవాడు, పేరు పెట్టి పిలుస్తావా? పైగా ఆడపిల్లవు నువ్విప్వకుండా కాఫీ వాడినిమ్మంటావా? ఎంత ధైర్యం?" అంటూ రంకెలు వేసింది చేతిలో జపమాల తిప్పుకుంటున్న శీతల్ నాయనమ్మ.

ఆవిడ నోరు పెద్దది, విగ్రహం పెద్దది, మనసు మాత్రం మనవలకే పెద్దది. మనవరాలంటే ఎప్పుడూ చిన్న చూపే.

" నాకన్నా ముందు పుట్టాడు కనక పెద్దవాడయ్యాడు.. బబ్లూ అని పిలవడమే నాకిష్టం.. ఇక కాఫీ వాడిస్తే చల్లబడిపోదు, చెడిపోదు" అంది తాపీగా..

" చూశావురా దీని ఆగడం! మాటకి మాట నేర్చింది.. పెద్దలంటే లక్ష్యం లేదసలు" దండకం మొదలుపెడుతున్న అత్తగారిని ఆపి..

" పోనీలేండి మాజీ! చిన్నపిల్ల, పుస్తకం చదువుకుంటూ అంది, నేనే ఇచ్చి వస్తా వాళ్ళ నాన్నకి" అంటూ చున్నీ తలమీదకు లాక్కుని లేచి వెళ్ళి భర్తకి కాఫీ ఇచ్చివచ్చింది శీతల్ వాళ్ళమ్మ కోమల్..

" మాట్లాడితే వెనకేసుకుని వస్తావు దాన్ని, ఆడపిల్లకి పనీ పాటా నేర్పలేదని ఆ పైన మనల్నే అంటారు కాబోయేవాళ్ళు" అంది ఆవిడ రుసరుసలాడుతూ..

కోమల్ నవ్వింది. అమ్మ కెప్పుడైనా కోపం వస్తేనూ, నాయనమ్మకెప్పుడైనా నవ్వు వస్తేనూ చూడాలని శీతల్ కోరిక, ఇప్పటివరకూ నెరవేరలేదు..

ఆ మాటే అమ్మనడిగితే, మీ నాయనమ్మకు నవ్వు రాకేం? నీ అన్నా, తమ్ముళ్ళని చూస్తే ఎప్పుడూ ప్రసన్నమేగా ఆవిడ ముఖం..

"ఇక నా కోపం అంటావా?. నాకుకోపం వచ్చినా పెద్ద ఉపయోగం లేదు బేటా! ఊరికే కోపం తెచ్చుకుని నన్ను నేను కష్టపెట్టుకోవడం తప్ప మరేమీ కనబడదు నాకు,దానికన్నా ఊరుకుని మన పని మనం చేసుకుంటూ పోవడం మంచిదనుకుంటాను నేను. దాన్ని ఓర్పనుకో, సహనమనుకో, పేరేదైనా నా తత్వం అది...

కానీ నువ్వు మాత్రం అలా ఉండకూడదు. బాగా చదువుకుని, మంచి ఉద్యోగం చేసుకుని నీకు తగినవాడిని చూసి పెళ్ళి చేసుకుని హాయిగా ఉండాలి. అనేది.

"నీ అంత ఓర్పు నాకుందా అమ్మా?" అంటే!

" కేవలం ఓర్పు ఒక్కటి ఉంటే చాలదు చిట్టితల్లీ. అది ముఖ్యమే కానీ పోరాటం లేని ఓర్పుకి అర్థం లేదు. పోరాటమంటే మన ఉనికి కి, వ్యక్తిత్వానికి, అస్తిత్వానికి మనం జరిపేది, మన అభివృద్ధికి దారితీసేది, తెలిసిందా? " అనేది అమ్మ..

" ఓ! తెలిసిందిగా, అలాగే అమ్మా!" అంటే నవ్వేది.. ఎంత బావుంటుందో అమ్మ నవ్వు.

నాన్న అంత మెత్తటి మనిషితో, నాన్నమ్మంత గయ్యాళితో ఎలా అన్నేళ్ళు మనగలిగిందో తల్చుకుంటేనే ఆశ్చర్యం తనకి.. ముగ్గురు మగపిల్లలని ఇచ్చిందన్న సాఫ్ట్ కార్నర్ తప్ప మరేమీ లేదు నాన్నమ్మకి అమ్మ మీద.

తనూ మెత్తగా ఉంటే అమ్మలాగే అయిపోతానని తనకి చిన్నప్పుడే తెలిసిందేమో? లేక అదే పోరాటమో మరి.

నాన్నమ్మకి ఎదురు చెప్తే ఆవిడకి కోపం వస్తే తనకి సరదాగా ఉండేది, ఆ సరదాలోనే "దీంతో పెట్టుకోలేం" అన్న మూతివిరుపులతో పాటు తనని పెద్దగా పట్టించుకోకపోవడం వచ్చిందని గుర్తించింది. అదే మొదలు.. తననుకున్నవి సాధించుకోవడానికి పెద్దగా కష్టపడలేదు శీతల్.. అది జీన్స్ వేసుకోవడమైనా, ఇంటిని వదిలి హాస్టల్ లో ఉండి మరీ చదువుకోవడమైనా సరే!.

"దీనికి పదహారు నిండిపోతాయిరా బేటా! పెళ్ళి చెయ్యాలి కదా! అసలే పొట్టిది" అంటూ మొదలు పెట్టిన ఆవిడ మాటలకి తను నవ్వుతూనే..

"అయితే బబ్లూకి కూడా పెళ్ళా? " అంది..

" అదేమిటీ? వాడికెందుకు?" అందావిడ..

" వాడికి పదహారు నిండి నాలుగేళ్ళైందిగా మరి!" అంది శీతల్..

"నువ్వూ, వాడూ ఒకటేనా? వాడు చదువుకుంటాడు, ఆపైన వాడికిష్టమైతే ఉద్యోగం లేదంటే వ్యాపారం చేస్తాడు.. ఆపైన వాడికి నచ్చిన పిల్లని దర్జాగా, హాయిగా చేసుకుంటాడు, అలాగే నీ తమ్ముళ్ళూనూ" అందావిడ మనవరాలిమీద కోపంతో విసుగ్గా.

" అలాగా! ఐతే నేనూ అంతే!" అంది శీతల్ చిలిపిగా. కుర్చీలో కూర్చుని కాళ్ళూపుతూ..

"అలా కాళ్ళూపకే, దరిద్రం, ఏదో ఏడు.. మీ అమ్మా, నాన్నలకి లేని బాధ ముసలిదాన్ని నాకెందుకు?" అనేది ఆవిడ.

పరవాలేదులే బామ్మా, ఆ మాత్రం ఆశీర్వదించావుగా ఏడు అని.. అనేది తను కూడా పెంకిగా....

“ఊరుకోమన్నానా? మాటకి మాట చెప్తే కానీ తోచదు నీకు! గయ్యాళి దానివి, ఎవడు చేసుకుంటాడో కానీ ఛస్తాడు నీతో వేగలేక” పెద్దావిడ రెచ్చిపోయేది..

ఆవిడా ఆడదే, అయినా ఇటు పుల్ల తీసి అటు పెట్టదు. అమ్మా ఆడదే, ఒక్క క్షణం ఖాళీ ఉండదు తనకి.. తనూ ఆడపిల్లే, తనని ఎప్పుడూ అది చెయ్యలేదు ఇది చెయ్యలేదు అని సతాయింపు.. ఈ బేధం ఏమిటో మొదట్లో అర్ధమయ్యేది కాదు శీతల్ కి.

మీ బామ్మ సంగతి తెలిసినదే కద, కోరి ఆవిడతో పోట్లాటెందుకు పెటుకుంటావు తల్లీ? అనేది అమ్మ.

ఎవరో ఒకరు అడకగపోతే ఎలా అమ్మా? నా పెళ్ళి నా ఇష్టం లేదా? అయినా జీవితానికి పెళ్ళే ముఖ్యమా? చదువు, ఉద్యోగం, కావలసినదేదైనా వ్యాపకం, హాబీ ఏదీ వద్దా? అనేది శీతల్.

"ఉష్! గట్టిగా అరవకు, మీ నాయనమ్మ వింటే తంటా" అనేది అమ్మ..

అలా ప్రతీ చిన్న దానికీ పోట్లాడుతూ, పోరాడుతూ తన పనులు నెగ్గించుకునే క్రమంలో ఎప్పుడో తనకి తెలీకుండానే ఓర్పు వచ్చిందేమో లేకపోతే ఎంత కష్టమైన కస్టమర్లతోనైనా బాగా వ్యవహరించగలదనే పేరు ఎలా తెచ్చుకుంది?

అందుకే త్వరగానే సూపర్వైజర్ స్థాయికి చేరుకుంది..

కానీ ఆపనిది మాత్రం పోరాటమే.

“మేడమ్! మీరు లంచ్ కి వస్తారా? మేం వెళుతున్నాం”. అడిగింది రమ..

"మేడమ్ ఎందుకు? శీతల్ అనండి చాలు, వెళ్దామా? ఇప్పుడే వెళతారా? మీరు రోజూ. ఇంకా పన్నెండున్నరేగా?" అంది చిరునవ్వుతో.

" శివ ఈరోజు ఏమీ తినలేదుట పొద్దున్నించీ, అందుకే త్వరగా వెళ్ళి వచ్చేస్తాం' అంది వాణి.

" ఓకే వెళ్దాం రండి" అంటూ నడిచింది శీతల్ వారివెంట..

" టైము చూసుకుని అన్నం తినం కద మేడం, ఆకలిని చూసి కానీ" శివ గొంతునిండా వెటకారంతో అన్నాడు చాలా జోక్ వేస్తున్ననుకుంటూ..

నవ్వింది శీతల్ కూడా. కానీ పని మాత్రం గడియారం చూసే చేస్తాం కదా!" మెత్తగా అన్నా బానే తగిలింది శివకి ఆ మాట..

అప్పటికే ఆమె వాళ్ళ టైం షీట్ లు చూసింది. అందులో వాళ్ళు వచ్చే పోయే వేళలన్నీ రికార్డ్ అయి ఉన్నాయి.. దానికన్నా ముఖ్యం వాళ్ళు పనిచేసే తీరుతెన్నులు..

కష్టమర్ ఇచ్చిన మెయిల్ కి ఎంత సేపట్లో సమాధానం ఇవ్వాలి?

ఒకవేళ మనకి తెలియకపోతే ఎవరినైనా అడిగి తెలుసుకుని ఎలా చెప్పాలి? లాంటి వెన్నో ఉంటాయి

ఎవరైనా సరిగా పని చేస్తున్నారా, లేదా? అని తెలియచేసేందుకు.

అవన్నీ ఆమె చూసిందని శివకి అర్ధం అయింది. మరేమీ అనలేక ఓ నవ్వు నవ్వాడు..

అందరూ కేఫెటీరియాలో ఎవరికి కావలసినది వాళ్ళు తెచ్చుకున్నారు..

అందరిగురించి అడిగి తెలుసుకుంది. తినడంపూర్తి కాగానే మరో ఐదునిమిషాలయ్యాకా ‘వెళదామా ‘ అంటూ లేచింది..

ఆమె వెనకే తప్పదన్నట్టుగా కదిలారు వాళ్ళందరూ.

ఆమెకి మొదట తనకి సమస్య వచ్చేది ఎవరితోనో అర్ధం అయింది

అయితే అది ఆమె అనుకున్నదానికంటే త్వరగానే వచ్చింది.

శివ ఒక రోజు పొద్దున్నే ఆమె క్యూబికల్ లోకి వచ్చాడు సుడిగాలి లా.. "ఇలా ఎలా రాస్తారు మీరు?" అంటూ..

"ఎలా రాశాను? దేని గురించి మీరు మాట్లాడేది? "అంది శీతల్ నిదానంగా.

"మీరు నెలవారీ రిపోర్ట్ లు తయారుచెయ్యడమెందుకు? దాంట్లో మీరు నాగురించి ఇలాంటి వివరాలన్నీ రాయడమెందుకు?" అన్నాడు..

"మొదటిది నా పని, దాని గురించి మీరు నాకు కానీ, మీకు నేను కానీ చెప్పాల్సిన అవసరం లేదు. రెండోదాన్ని గురించి కావాలంటే మాట్లాడదాం!" అంది గట్టిగా..

" ఓ అలాగా! ఓ కే, అదే మాట్లాడదాం.. మీరు ఈ రిపోర్ట్ లో ఇవన్నీ రాయడం ఎందుకు? పైగా దాన్ని సెంటర్ హెడ్ కి, హె.చ్ ఆర్ వారికీ పంపడమెందుకు?" అన్నాడు విపరీతమైన కోపం అతనిలో..

" చూడండి శివా! ఈ గ్రూప్ సూపర్ వైజర్ గా ప్రతీ నెలా నివేదిక నివ్వడం నా బాధ్యత. దాంట్లో మొత్తం టీముది, ఒక్కో సభ్యునిదీ విడిగానూ ఇవ్వాల్సి ఉంటుంది.. ఇవన్నీ మీకు తెలియనివి కాదు, చాలా రకాలైన అంశాల మీద ఈ రేటింగ్ ఇస్తాం కదా, దీంట్లో అబద్ధం లేదు. నంబర్లెప్పుడూ అబద్ధలు చెప్పవు.. మన డేటాబేస్ నించి నేను ప్రతీవారం వివరాలుతెప్పించుకుంటాను, దాన్ని మీ అందరితోనూ చర్చిస్తాను. ఇవీ మీకు తెలియనివి కాదు."

"అదంతా నాకు తెలుసు, నేనడిగేది ప్రత్యేకంగా నా పని హైలైట్ చెయ్యడమెందుకు? " అని అన్నాడతను విసురుగా..

"మీ ఒక్కరిదే ఇవ్వలేదు నేను. అందరి డీటెయిల్స్ ఉన్నాయి దాంట్లో . నేను ముందే చెప్పాను మీకు అది నా డ్యూటీ అని.." అంది ఇంకేమీ మాట్లాడేది లేదన్నట్టుగా.

విసురుగా వెళ్ళిపోయాడు 'చూస్తాను' అన్నట్టుగా, వెళ్తూ, వెళ్తూ ఆమె క్యూబికల్ గోడని తన్నుకుంటూ మరీ వెళ్ళాడు.

ఆమె తిరిగి తన పనిలో పడిపోయింది, మర్చిపోయింది ఆ విషయాన్ని అక్కడితో.. అయితే అతను మర్చిపోలేదు..

హెచ్. ఆర్ హెడ్ కి ఫిర్యాదు చేశాడు..

రెండు రోజుల తర్వాత ఫోన్ చేశాడు హెచ్ ఆర్ హెడ్ రాఘవ్.. " శీతల్ ఒకసారి రండి నా కేబిన్ లోకి" అంటూ

అక్కడకి వెళ్ళేసరికి శివ అక్కడే కూర్చుని ఉన్నాడు.

"ఏమయింది శీతల్? విషయమేమిటో చెప్పండి." అన్నాడు రాఘవ్.

"నేనే చెప్తాను రాఘవ్ !" అంటూ శివ ఆవేశంగా తను చెప్పదల్చుకున్నది చెప్పేశాడు..

"నేను పెద్దగా చూడలేదు నివేదికని,నాకు సంబంధం లేదు కనక. కానీ అందరూ ఇలా రిపోర్ట్ పంపడం బావుంది, తెలుస్తోంది విషయం అని అంటున్నారు కదా! "అన్నాడు రాఘవ్..

"కరక్ట్! మనం కష్టమర్లని ఎలా చూసుకుంటు న్నామో తెలుస్తుంది" అంది శీతల్ చిన్నగా నవ్వుతూ..

"అలా ఎందుకులెండి? శివ ఎలా పని చేస్తున్నాడో తెలుస్తుంది అని చెప్పండి. నా మీదేగా మీ కోపం అంతా" అన్నాడు శివ అక్కసుగా..

"మనిద్దరికి పరిచయం ఆఫీస్ ద్వారా కేవలం మూడునెలలు, అంతకు మించి మరేమీ తెలీదు, తెలియక్కరలేదు, ఇంతలో మీమీద కోపం పెట్టుకోవలసిన అవసరం కానీ, అది ఏదో ఒక దారిలో నలుగురికీ చెప్పాల్సిన అగత్యం కానీ నాకు లేవు.. మీకు మొన్ననే చెప్పాను, ఇప్పుడు రాఘవ్ మీకు కూడా చెప్తున్నాను.

గత ఏడు సంవత్సరాలుగా నేను కస్టమర్ కేర్ లో ఉన్నాను, నా అనుభవంలో తెలుసుకున్న మంచి పద్ధతులు పాటించడానికి ప్రయత్నిస్తున్నాను. అదీ కాక నా డ్యూటీ లో భాగంగా నేను చెయ్యవలసిన పనులు కొన్ని ఉంటాయి, అందులో ఇదీ ఒకటి. నేనీ నివేదికని ప్రతీవారం తెప్పించుకుంటాను రాఘవ్. నేను, నా టీము ఎలా మా పనులు చేస్తున్నామో నాకర్థం అవుతుంది, ఎక్కడ మార్చుకోవాలో తెలుస్తుంది. అది తెప్పించాకా ప్రతీ వారం నేను ఒక్కొక్కరితోనూ మాట్లాడతాను, ఇది గత మూడు నెలలుగా చేస్తున్నాను..మరి కొన్నాళ్ళు చేస్తే ఒక స్థాయికి వస్తాము అని నా నమ్మకం.

ప్రతీ ఒక్కరి వివరాలు వాళ్ళతో మాట్లాడుతూనే ఉన్నాను, అలాగే శివా మీతో కూడా. ఎక్కడ మార్చుకోవాలో చెప్తున్నాను. మీరు ప్రతీ వారం అదేదో నేను కథ చెప్తున్నట్టుగా విని ఊరుకుంటే అది నా తప్పు కాదు కదా!?" అంది శాంతంగానే.

"ఏదో పరధ్యానంలో ఉండి చిన్న విషయాలని కొద్దిగా పట్టించుకోలేదేమో నేను" అన్నాడు శివ.

"చిన్న విషయాలే కాని ముఖ్యమైనవి, మర్చిపోకూడనివి.. పదే పదే చెప్పినా సరే పట్టించుకోకపోతే దాని పరధ్యానమనరు మిస్టర్ శివా, పని మీద ధ్యాస లేకపోవడం అంటారు. అంత ధ్యాస లేని పని మనం చెయ్యక్కర్లేదు, మీకిష్టంలేకపోతే మీరైనా సరే, నాకు నచ్చకపోతే నేనైనా సరే! అయినా నేను నివేదిక పంపాను తప్ప మీ గురించి అని ప్రత్యేకంగా ప్రస్తావించలేదు, ఇకపైన చెయ్యాల్సి రాకూడదని ఆశిస్తాను.. ఇంకేమైనా ఉంటే చెప్పండి మాట్లాడదాం, లేదంటే నాకింకా పది మెయిల్స్ ఉన్నాయి జావాబివ్వడానికి ఈ రోజుకి" అంది చాలా స్థిరంగా..

అవాక్కయినట్టు చూస్తూ ఉండిపోయాడు రాఘవ్.. ఈ అమ్మాయిని తను ఇంటర్వ్యూ చెయ్యలేదు, ఆఫర్ ఇచ్చాకా మొదటిసారి చూసినప్పుడు "ఈ అమ్మాయేం చెయ్యగలదు?" అనుకున్నాడు కూడా.

"ఓకే రాఘవ్! నేను వెళ్ళనా మరి" అంటూ లేచి నిలబడింది శీతల్..

"గట్టిదానివేనే పిల్లా!" అంటోంది నాయనమ్మ ఆమె తలపుల్లో.. నీవద్ద మొదలైన విద్యయే విద్యయే నాయనమ్మా" అనుకుంది.

●●●

Click here to share your comments on this story